# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'ప్రోగ్రెస్ రిపోర్ట్ 2024-26' పేరుతో నివేదికలను విడుదల చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

**2.** **తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమవుతారు.**

**3.** **ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రతి వర్గానికి సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**

**4.** **ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యనిస్తోందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'ప్రోగ్రెస్ రిపోర్ట్ 2024-26' పేరుతో నివేదికలను విడుదల చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రెండేళ్లలో ప్రభుత్వం సాధించిన పురోగతి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, పాలనా సంస్కరణలు ప్రజలకు తెలియజేయడమే ఈ నివేదికల లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాగే అభివృద్ధి, సుపరిపాలన, సంక్షేమం-సాధికారత అంశాలపై మరో మూడు నివేదికలను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

--------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈ రోజు పలువురు కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌లతో ముఖ్యమంత్రి సమావేశమై రాష్ట్ర అభివృద్ధి, మౌలిక వసతులు, వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై చర్చలు జరిపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అదేవిధంగా

కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులతో కూడా సమావేశమై పలు అంశాలపై చర్చించనున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రతి వర్గానికి సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. అమరావతిలో నిర్వహించిన "కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభ" కార్యక్రమంలో నిన్న పాల్గొని గత రెండేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈ సందర్భంగా తెలియజేస్తూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని అనకాపల్లి జిల్లా బోయపాడు తీర ప్రాంతంలో చేపలు మృతి చెందిన ఘటనపై ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ స్పందించారు. ఘటనకు గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చేపల మృతికి కారణమైన పరిస్థితులను శాస్త్రీయంగా పరిశీలించాలని, నీటి నమూనాలు ఇతర సంబంధిత అంశాలపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో "సమాజంపై సామాజిక మాధ్యమాల ప్రభావం" అంశంపై అనంతపురంలో నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక కాలంలో సామాజిక మాధ్యమాలు సమాచార వ్యాప్తిని వేగవంతం చేసినప్పటికీ వార్తల విశ్వసనీయత, ప్రామాణికత విషయంలో సాంప్రదాయ ప్రింట్, ఎలక్ట్రానిక్ మాధ్యమాల పాత్ర కీలకమని అన్నారు. పాత్రికేయులు వాస్తవాలకు ప్రాధాన్యం ఇస్తూ ఖచ్చితమైన సమాచారాన్ని ప్రజలకు అందించాల్సిన అవసరం ఉందని పయ్యావుల కేశవ్ తెలియజేస్తూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మాదకద్రవ్యాల నియంత్రణకు ఈగల్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. విజయవాడలో నిర్వహించిన 'యోగాంధ్రా' కార్యక్రమం అనంతరం EAGLE 1972 హెల్ప్ లైన్ ప్రచార పత్రికలను ముఖ్యమంత్రి నిన్న ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా మరింత విస్తృత స్థాయిలో ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలను చేపట్టాలని ఈగల్ బృందాన్ని ప్రోత్సహించారు. అలాగే వ్యసనముక్త భారత్ అభియాన్ ప్రచార వాహనాన్ని కూడా ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు.

---------------------------

ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యనిస్తోందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం ఆర్టీసీ కాలనీలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి –సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఇప్పటి వరకు 854 మంది లబ్ధిదారులకు మొత్తం 7.98 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ వైద్యసేవ పరిధిలో చికిత్స పొందలేని రోగులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల సహాయం అందిస్తున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..25.. సెకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వం జులై 1 నుంచి అమలు చేయనున్న కొత్త ఉపాధి విధానంపై సమగ్ర అధ్యయనం చేపట్టి, తెలంగాణ ప్రయోజనాలను కాపాడేలా తుది నివేదిక రూపొందించాలని మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయించింది. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నిన్న జరిగిన సమావేశంలో గ్రామీణ సంక్షేమం, వ్యవసాయ రంగం, స్థానిక సంస్థలపై కొత్త విధానం ప్రభావాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రజల అవసరాలు, కూలీల జీవనోపాధి, ఉపాధి అవకాశాల పరిరక్షణ అంశాలను దృష్టిలో ఉంచుకుని వివిధ అంశాల వారీగా అధ్యయనం కొనసాగించాలన్నారు. రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునేలా ఇతర ఇతర రాష్ట్రాలతో కూడా సంప్రదింపులు జరపాలని మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయించిందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో సముద్ర కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణ రక్షణకు చర్యలు చేపడుతున్నామని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్ తెలిపారు. విశాఖపట్నంలో ఆయన నిన్న మాట్లాడుతూ, ఆర్కే బీచ్, రుషికొండ బీచ్ పరిసర ప్రాంతాల్లో శుద్ధి చేయని మురుగునీరు సముద్రంలోకి చేరకుండా 330 కోట్ల రూపాయల వ్యయంతో ఆధునిక శుద్ధి సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

---------------------------

రాయలసీమ, దాని పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని, ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ వరకు ద్రోణి కొనసాగుతోందని అమరావతి వాతావరణం కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని పలు ప్రాంతాల్లో ఈ రోజు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈరోజు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================